భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడు

■ జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి ■ ఘనంగా నివాళులర్పించిన నేతలు

వికారాబాద్: యజ్ఞాఫౌండేషన్ ఆధ్వర్యంలో ..

కులకచర్ల: చౌడాపూర్ మండలం మరికల్‌లో..

కులకచర్ల, జనవరి 12: స్వామి వివేకానంద ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఇప్పాయిపల్లి, ఘనాపూర్, బండవెల్కిచర్ల, చెల్లాపూర్, చౌడాపూర్ మండల పరిధిలోని చౌడాపూర్, మరికల్ గ్రామాల్లో వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కులకచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో కులకచర్ల గ్రామ మాజీ సర్పంచ్ సౌమ్యావెంకట్‌రాంరెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొలుసాని శ్రీధర్‌రెడ్డి, దిశకమిటీ సభ్యుడు డాక్టర్ జానకీరాం, నాయకులు హరికృష్ణ, మాలె కృష్ణయ్యగౌడ్, మహిపాల్, చంద్రలింగం, సంతోశ్, చాకలి వెంకటేశ్, ఘనాపురం రాఘవేందర్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, వివేకానంద యువజన సంఘం సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలో యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుజ్వల్ రాజ్‌స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యజ్ఞ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి ప్రదాత, భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన చైతన్య మూర్తి వివేకానంద స్వామి అన్నారు. ఆయా గ్రామాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని కల్‌ఖోడా గ్రామంలో స్వామి వివేకనంద జయంతిని ఘనంగా జరుపుకొన్నారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీమంత్ గ్రామస్తులు పాల్గొన్నారు..

పూడూరు: పూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడని పేర్కొన్నారు. తన సందేశాలతో భారతజాతిని జాగృతం చేసిన గొప్పవ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు.

పెద్దేముల్: పెద్దేముల్ మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు నరేశ్‌రెడ్డి, అడ్వకేట్ ఎల్లారెడ్డి, గోపాలకృష్ణ, రాము నాయక్, డీవై నర్సిములు, రియాజ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ధారూరు: యువత స్వామి వివేకానందుడుని ఆదర్శంగా తీసుకోవాలని ధారూరు సీఐ రఘురామ్ అన్నారు. మండల పరిధిలోని నాగస ముందర్, నాగారం, కుక్కింద, అంతారం, హరిదాస్‌పల్లి, తదితర గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ధారూరు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్, హన్మంత్ రెడ్డి, నాయకులు వివేకానందరెడ్డి, వీరేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నందకుమార్, నరేందర్‌రెడ్డి, బాలకృష్ణ, బుగ్గయ్య, అనిల్, వెంకటయ్య, నరేందర్, బలవంత్ రెడ్డి యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: నాగారం గ్రామంలో ..

బషీరాబాద్: ఎక్మాయి గ్రామంలో..

వికారాబాద్, జనవరి 12 : మోమిన్ పేట మండల పరిధిలోని టేకులపల్లి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు బ్రహ్మంచారి, సంజీవయ్య, లీలా కుమారి, రత్నం, శ్రీనివాస్, ప్రకాశం, పూర్వ విద్యార్థులు నాగేశ్వర్, రమేశ్, విఠల్, జగదీశ్వర్, ఆంజనేయులు, రాజు, రత్నం, శ్రీలత తదితరులు ఉన్నారు.

వరుస చోరీలతో ప్రయాణికుల హడల్

- వారం లోపే రెండు చైన్ స్నాచింగ్‌లు, నగదు మాయం
- పరిగి బస్టాండ్‌లో దొంగతనాల పర్వం..
- ప్రత్యేక నిఘా ఏర్పాటుకు పలువురి డిమాండ్

పరిగి, జనవరి 12: పరిగిలోని బస్టాండ్‌లో వారం రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. గత మంగళవారం నుంచి శనివారం వరకు వరుసగా మూడు దొంగతనాలు జరిగాయి. ఏ ఒక్క సంఘటనలోనూ దొంగలు పట్టుబడలేదు, పోయిన సొత్తూ రికవరీ కాలేదు. దీంతో ఎప్పుడు దొంగతనం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనలో ఉన్నారు. పరిగి పట్టణం నడిబొడ్డున గల బస్టాండ్ వేదికగానే ఈ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. జరిగిన మూడు దొంగతనాలలో రెండు చైన్ స్నాచింగ్‌లు, ఒక నగదు చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈనెల 7వ తేదీన ధారూరు మండలం కేరెల్లి గ్రామానికి చెందిన శివలీల తల్లిగారి ఊరైన రాజాపూర్‌కు వెళ్లింది. హైదరాబాద్‌లో నివాసముండే ఆమె తిరుగు ప్రయాణంలో మంగళ వారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో పరిగి బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు దొంగిలించారు. 15 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి బస్సులోని ప్రయాణికుల బ్యాగులు వెతికినా లభించలేదు. ఇదిలావుండగా ఆర్టీసీ బస్సు లో ప్రయాణిస్తున్న ప్రయాణికుడి నుంచి రూ.16వేలు కొట్టే శారు. కొద్దిసేపటి తర్వాత చూసుకున్న ప్రయాణికుడు వెంటనే కండక్టర్, డ్రైవర్‌కు చెప్పగా, మన్నెగూడలోని పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు నిలిపి వెతకగా డబ్బులు లభించలేదు. తాజాగా శనివారం రాత్రి మరో చైన్ స్నాచింగ్ పరిగి బస్టాండ్‌లో జరిగింది. కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామానికి చెందిన అనిత శనివారం హైదరాబాద్‌లో టెట్ ఎగ్జామ్ రాసి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్లడానికి రాత్రి 8 గంటల ప్రాంతంలో

ఆర్టీసీ బస్సులో పోలీసుల తనిఖీ (ఫైల్)

పరిగిలో మహబూబ్‌నగర్ బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అనిత మెడలో నుంచి బంగారు గొలుసు కొట్టేశారు. ఈ బంగారు గొలుసు 2 తులాలు ఉంటుంది. ఇలా వరుసగా అయిదు రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు చోటు చేసుకోవడం గమనార్హం.

బస్టాండ్ వేదికగా రెచ్చిపోతున్న దొంగలు...

గతంలో ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగతనాలు జరిగేవి. తాజాగా పరిగి బస్టాండ్ వేదికగా చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండడం గమనార్హం. పరిగి బస్టాండ్ నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉంటుంది. సాయంత్రం సమయంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రయాణికులు బస్సులు ఎక్కే సమయంలోనే రెండు చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. బస్సులు ఎక్కుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని, రద్దీ సమయంలో దొంగలు ఈ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. వరుసగా ఈ రెండు సంఘటనలతో అసలు ఈ దొంగతనాలకు పాల్పడుతున్న వారు ఈ పనిలో ఆరితేరిన వారుగా అనుమానిస్తున్నారు. ప్రయాణికులు రద్దీగా ఉండే బస్సులు ఎక్కుతున్న వారి మెడలో నుంచే ఈ చైన్ స్నాచింగ్‌లు జరగడంతో సాయంత్రం సమయంలో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా మఫ్టీలో పోలీసులు బస్టాండ్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తద్వారా బస్టాండ్‌లో ఏ బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే అక్కడ మరింత నిఘా పెంచడం ద్వారా ఇలాంటివి అరికట్టే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయిదు రోజుల వ్యవధిలోనే వరుసగా మూడు సంఘటనలు జరగడం ఆందోళన కలిగించే అంశమని, అందువల్ల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణికులతో కిటకిటలాడుతున్న పరిగి బస్టాండ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కులకచర్ల, జనవరి 12 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు పీడీ భాస్కర్, గోపాల్, మారుతిరావు, చిన్నస్వామి, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, వాసు, శంకర్‌నాయక్, చిన్నగోపాల్, రవి, కృష్ణ, పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

ధారూరు, జనవరి 12: మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో 1998-99 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 25ఎండ్ల తరువాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనాటి ఉపాధ్యాయులు సతీశ్ చంద్ర, మాణిక్ ప్రభు, బస్వరాజ్, రాజమౌళి, మల్లారెడ్డి, ఏసుదాసు, ఆంజనేయులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష పోస్టర్ల విడుదల

పరిగి, జనవరి12: గురుకుల ప్రవేశ పరీక్షల పోస్టర్లను ఆదివారం పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో పరిగి సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి, నంచర్ల గురుకులం ప్రిన్సిపాల్ రమణ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

■ ఉద్యోగ విరమణ సన్మానం



పరిగి, జనవరి 12: ఆర్‌డబ్ల్యూఎస్‌లో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జీహెచ్ఎంసీ ఆబిడ్స్, మల్కాజిగిరి ప్రాంతాల్లో, అంతకుముందు పరిగిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పరిగికి చెందిన చెట్టుకింది సత్యనారాయణ-వసుమతి దంపతులను ఆదివారం పరిగిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూర జయదేవ్, డాక్టర్ జగన్మోహన్, బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు సన్మానించారు.

మాదిగ విద్యార్థి యువ గర్జన కరపత్రం ఆవిష్కరణ

మాదిగ విద్యార్థి యువ గర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12: ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించనున్న మాదిగ విద్యార్థి యువ గర్జనను విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ ఆధ్వర్యంలో గర్జనను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వరంగల్ రవి, డాక్టర్ నంద్రు నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన మేధావుల సభకు హాజరై సంఘీభావం తెలిపిన మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బొమ్మర సమ్మయ్య, నల్లగట్ల సుమంత్, వలిగొండ నరసింహ, మొలగరం బాబురావు, జోగు గణేశ్, నక్క మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జనవరి 12: సికింద్రాబాద్-సీతాఫల్‌మండి ఏ క్యాబిన్ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సుమారు 40-45 ఏండ్ల మధ్య ఉంటాయని, ఒంటిపై ఎరుపు రంగు టీషర్టు, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదం..10 లక్షల నష్టం

అగ్ని ప్రమాదం జరిగిన ఫ్లాట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

ఏసీపీని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ

అపార్ట్‌మెంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 12: గాంధీనగర్ డివిజన్ వై జంక్షన్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఫ్లాట్‌లోని గృహ ఉపకరణాలు, ఇంట్లోని సామగ్రి కాళి బూడిదయ్యాయి. సంఘటనా సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం... రాఘవేంద్ర పార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ 307, 308 సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొత్త సూర్యనారాయణ, భార్య ఝాన్సీ, కుమారుడు సూర్య కృష్ణలతో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం 8 గంటలకు ఇంటికి తాళం వేసి తమ సొంతూరు అశ్వారావుపేటకు బయలుదేరారు. దాదాపు 10 గంటల సమయంలో ఫ్లాట్‌లో నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. ముషీరాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ బి.నర్సింహ సంఘటన స్థలానికి సిబ్బందితోపాటు చేరుకుని మంటలను ఆర్పారు. అదేవిధంగా చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఆఫీసర్ భానుప్రతాప్, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సీఐ రాంబాబు, చిక్కడపల్లి డీఐలు, ఎస్సైలు అభిలాష్, మౌనిక సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సగం దూరం వరకు వెళ్లిన సూర్య ఇంటి యాజమాని సూర్యనారాయణ తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి పరిస్థిని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాదాపు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు, ఫ్రిడ్జ్‌లో షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏసీపీ రమేశ్ కుమార్, అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. పండుగ పూట అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం బ బాధాకరమన్నారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. యువ నాయకుడు ముఠా జయసింహ, నాయకులు రాకేశ్‌కుమార్, శ్యామ్ యాదవ్, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్, దీన్‌దయాల్ రెడ్డి, చాణిక్య రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం..



కులకచర్ల, జనవరి 12: మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శివరామలింగేశ్వరస్వామి ఆలయానికి తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జేసీఐ ఫౌండేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ రూ.51వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ వేణుగోపాల్, గ్రామస్తులు రాఘవేంద్రాచారి, వెంకటయ్య, శేఖర్‌గౌడ్, రాములు, కాశయ్య పాల్గొన్నారు.

■ క్యాలెండర్ ఆవిష్కరణ

వికారాబాద్, జనవరి 12: వికారాబాద్ ఎన్నెపల్లిలో వీరశైవ సమాజం, బసవేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, సొసైటీ ప్రెసిడెంట్ బస్వరాజ్ , వీరశైవ సమాజం ప్రెసిడెంట్ విజయ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ..బంగారు ఆభరణాలు మాయం

వెంగళరావునగర్, జనవరి 12: మహిళా బౌన్సర్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో పి.మౌనిక(26) భర్త సంతోష్‌తో కలిసి నివాసం ఉంటుంది. మౌనిక నగరంలోని ఓ పబ్‌లో బౌన్సర్‌గా పని చేస్తున్నది. మౌనిక తల్లి రమాదేవి ఇటీవలె సొంతూరు నుంచి రహ్మత్‌నగర్ వచ్చి కుమార్తె వద్ద ఉంటుంది. శనివారం భార్యాభర్తలిద్దరూ డ్యూటీలకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో రమాదేవి షాపింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో దాచిన బంగారు ఆభరణాల బాక్స్ కన్పించలేదు. ఈ విషయమై ఆమె కూతురు మౌనికకు ఫోన్ చేసి తెలుపగా.. మౌనిక ఇంటికి వచ్చి బీరువాలో దాచిన 33 గ్రాములు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18 నుంచి ముదిరాజ్‌ల బస్సు యాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న చెన్న రాములు

ఖైరతాబాద్, జనవరి 12: ముదిరాజ్‌లను పాలకులు విస్మరిస్తున్న తీరును ఎండగడుతూ ఈనెల 18వ తేదీన గన్‌పార్కు నుంచి బస్సు యాత్రను నిర్వహించనున్నట్లు తెలంగాణ ముదిరాజ్ సంఘం నేత చెన్న రాములు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగ రంగాలతోపాటు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం గడుస్తున్నా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో పాటు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఇది ప్రజాపాలన కాదని, ముదిరాజ్‌ల ప్రాతినిధ్యంలేని పరిపాలన సాగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలకు, ముదిరాజ్‌లపై చూపిస్తున్న వివక్షతకు వ్యతిరేకంగా చేపట్టే బస్సు యాత్ర ఉమ్మడి పది జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. మొదటి విడతలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలు, రెండో విడతలో నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ సమావేవేశంలో ఉప్పరి నారాయణ, రమాకాంత్, యాదగిరి, సంజీవ్ ముదిరాజ్, ఓయూ విద్యార్థి నేత వెంకటేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

చిరుత సంచారం అవాస్తవం

వెతుకుతున్న అధికారులు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 12: చిరుత సంచారం అవాస్తవమని, సమీపంలోని కొందరు కావాలనే అలా తప్పుగా క్రియేట్ చేశారని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగం సూచించింది. రాజేంద్రనగర్‌లో వాటి ఆనవాలు కొరకు గాలించామని, సామాజిక మాధ్యమాలలో వచ్చిన వదంతులకు విశ్వవిద్యాలయం సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక పోలీసులు, అటవీ శాఖ అధికారులతో కలిసి, ఆదివారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో చిరుత ఆనవాల కొరకు సుమారు 4గంటల పాటు వెతికారు. ఎక్కడా పాదముద్రలు, ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు. సీసీ ఫుటేజీల్లోనూ కనిపించలేదని, విశ్వవిద్యాలయం సెక్యూరిటీ ఆఫీసర్ డా. హుస్సేన్ తెలిపారు. అవసరమైతే ఈ రాత్రి అంతా నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేస్తామని సూచించారు. విద్యార్థులు రాత్రివేళల్లో రోడ్లపై తిరుగవద్దని సూచించారు.